గిరిజా కళ్యాణం

రావూరి భరద్వాజ

దక్షాధ్వర ధ్వంసం జయప్రదంగా జరిగి పోయింది. ప్రమథులు ఆనందంతో తాండవం చేశారు శంకరుడు, తనలో క్రోధాగ్ని జ్వాలలు చల్లారినా, ఇంకా పొగలూ, సెగలూ విరజిమ్ముతూనే ఉన్నాడు.

ఇప్పటిగ్గానీ దేవతాకోటి నిజస్వరూపాన్ని శంకరుడు అవగాహన చేసుకో లేదు ఇంతకాలంగా తను భ్రమాజనిత జగత్తులోనే జీవిస్తూ వచ్చాడు. 'కాదు కూడ'దని తనఅంతరాత్మ ఘోషిస్తున్నా వినిపించుకోలేదు. దాన్ని చిచ్చికొట్టి నిద్రపుచ్చాడు ఏవో ప్రయోజనాల నాసించి_ముఖ్యంగా తన జాతివారి సంక్షేమం కోసమనే, తను విష్ణుమూర్తి పరిపాలనా మండలిలో చేరాడు. తన కిష్టంలేని అనేక కారణాలను, సమష్టి బాధ్యత పేరుతో చేశాడు. దురదృష్ట వశాత్తూ, తనవారినేతనునిర్మూలించాడు.

అనేక సందర్భాలలో, తను చేస్తున్నది న్యాయమూ, ధర్మమూ కాదేమోనన్న అనుమానం శంకరునికి కలిగిన మాట నిజమే; అయినా అతగాడు వాటి నన్నింటినీ, బలవంతాన ప్రక్కకు త్రోసివేశాడు.

ఎందుకుచేశా డిదంతా ?

ఏదో విధంగా, తనవారి కింత సాయపడదామని; ఒక రిద్దరికి, తన చర్యల వల్ల అపకారం జరిగితే జరగవచ్చుగాక; బహు సంఖ్యాకులు ఇందువల్ల లాభపడతారు. లాభపడతారన్న ఆశే లేక పోతే, తనీ స్వజాతి విధ్వంసనానికి ఆయత్త పడకనేపోను.

ఏది ఏమైతే నేం గానీ, తను అనుకొన్నది వేరు, జరిగింది వేరు. తను కలలుగన్న వేవీ సాధించలేకపోవడమే కాదు; తన వారిని తనే చేతులారా నాశనం చేశాడు. అధిక సంఖ్యాకులకు

లాభం కలగడంమాట లేదుగదా - ప్రాణాలకు ప్రాణాలిచ్చే సంగీతకులను తను కోలుపోయాడు. దేవతాకోటి, తనను అక్షరాలా మోసగించింది. తను కూడా మోసపోయాడు. పైగా - తీరని అవమానాన్ని తను పొందవలసి వచ్చింది. ఇదంతా ముందుగా అనుకొని చేసిన కార్యమే ననడంలో సందేహం లేదు. దక్షప్రజాపతి; ఎన్ని గుండెలతో తనను ఆహ్వానించకపోవాలి మరి?

శంకరుడొక్కసారి తేరిపార చూశాడు. ప్రమథులు. ఇంకా కసితీరక, కనిపించిన ప్రత్యర్థి నల్లాపట్టుకొని చావమోదుతున్నారు. మహోగ్రతాపంతో జ్వలించిపోతూనే ఉన్నారు.

అందరినీ ఒక్కసారి తేరిపారచూసి, తలవొంచుకొన్నాడు శంకరుడు. ఆయన కన్నుల్లో సన్నని నీటిపొరలు, ఉరలి, పొరలి, చెక్కిళుల మీదుగా స్రవించ సాగాయి.

* * *

ఓ క్షణం చెవులు రిక్కరించి విని, లక్ష్మీదేవిని, భవనాంతర్భాగానికి వెళ్ళవలసిందిగా ఆదేశించాడు విష్ణుమూర్తి. అమ్మవారు వెళ్ళిపోయారు.

మహతిని, అలవోకగా మీటుకొంటూ నారదమహర్షులవారు విచ్చేశారు. మహర్షి అల్లంతదూరంలో ఉండగానే విష్ణువు ఎదురుగా వెళ్ళాడు. సగౌరవంగా తోడుతెచ్చి, తన ప్రక్కనే కూచుండబెట్టుకొన్నాడు. సాభిప్రాయంగా మహర్షివైపు చూచాడు.

"స్వామీ! మీ వంటివారి ఏలుబడిలో సమస్త లోకాలూ, సుఖసంతోషాలతో పింపెసలారుతూ ఉంటాయని ఆశించడం సహజం." అన్నాడు నారదుడు.

"ఇప్పుడేమయింది మహర్షీ" అన్నాడు విష్ణువు

"దేవా! ఇవన్నీ మీకు తెలియని విషయాలుకావు. దేవతాకోటి తనను మోసగించిందని శంకరుడు గ్రహించాడు. తనప్రేలితో తనకన్నులే పొడుచుకొన్నాననికూడా, ఆయనకు అవగాహనమయిపోయింది. తనబలాన్ని పెంపుచేసికోనడం కోసం. ఇప్పు డతను హిమాలయపరవత ప్రాంతాలలో పర్యటిస్తున్నాడు. తమ ప్రభుత్వ వాసన ఏ కోశానా అంటని ప్రాంతాలవి. అక్కడి వారితో మంతనాలు జరుపుతున్నాడు. పార్వతేయులు, సామాన్యులుకారు, అసామాన్యులు, విలువిద్యలోనూ, వూ, హ్యేచరుతలోనూవారుఅందెవేసినచేతులు. గిరివాసులు కావడంతో, వారి శరీరాలు లోహనిర్మితాలేమో నన్నంత దృఢంగా మారిపోయాయి. వారందరూ, నేడో రేపో శంకరుని బలగంలో చేరనున్నారు. ప్రమథగణం, పార్వతేయులకు, రకరకాల ఆశలనూ చూపుతున్నది. ఆశకు లొంగని ప్రాణి ఏది ప్రభూ! గిరివాసులు తిరుగుచోటు జరిపిన పక్షాన - విజయ

లక్ష్మి మనపక్షం వహిస్తుందని విశ్వసించడంలో వివేకంలేదు. ఆలోచించండి! చేతులుకాలిన తర్వాతగానీ, మనవారు ఆకులు ముట్టరు. అంతవరకూ రాకముందే, తగుచర్య లేవో తీసుకోవడం ప్రభువులధర్మం, ఆపైన మీ చిత్తం!" అని ముగించాడు నారదుడు.

విష్ణువు ప్రశాంతంగా విన్నాడు. పార్వతేయులు – తిరుగుబాటు వంటి మాటలు వింటున్నప్పుడు, ఆయనగారి కన్నులు కెంపుల్లా అరుణిమను వెలార్చాయి. అయినా పొంగలేదు. పెదవి కదలపలేదు. నిశ్శబ్దంగా విని, సన్నగా నిట్టూర్చాడు.

"హిమవంతు దేమంటున్నాడు?" అన్నాడు విష్ణువు.

"ఏమీ అనడంలేదు. బహుశా అనదు కూడా నేమో! శంకరుని ప్రచారం అతని కింకా తెలియదనుకోవడం ఆత్మవంచనే అవుతుంది. తెలిసికూడా అతను మౌనంగా ఉంటున్నా డంటే, శంకరుని చర్యను పరోక్షంగా ఆమోదిస్తునా డన్నమాట! కాదంటారా?" అన్నాడు నారదుడు.

విష్ణువు ఓ లిప్తకాలం ఆలోచించి, కనుబొమలు ముడిచాడు.

"హిమవంతునికి, మనపై కార్పణ్యం ఉండవలసిన కారణ మేమీ లేదే!" అన్నాడు విష్ణువు.

నారదుడు ఫక్కుమని నవ్వాడు.

"దేవా! మీరు తెలియకనే అడుగుతున్నారో, నన్ను పరీక్షిస్తున్నారో బోధపడడంలేదు. హిమవంతునికి మనపట్ల ద్వేషం ఉండడం నా కేమీ ఆశ్చర్యకరంగాలేదు...అదే–మనవి చేస్తున్నాను. పనిగట్టుకొని, మహాపర్వతాల పక్షాలన్నీ ధ్వంసంచేసిన దేవేంద్రుడు, ఇప్పటికీ మనపక్షాన ఉన్నాడు. చిన్నదానికీ పొన్న

దానికి. మనం అతన్ని పెద్దచేసి ఆరాధిస్తున్నాం. అతను చేస్తున్న ఛప్పనారు దోషాలనుమనం సమర్థిస్తున్నాం. అతన్ని మనవాడంటున్నాం. మన ప్రతినిధి అంటున్నాం. అతనికి ఉన్నతోన్నతమైన పదవిని సమర్పించుకొన్నాం. అవును గదా!"

విష్ణువు తలపంకించాడు.

"తన శత్రువుకు మిత్రుడైనవాడు తనకూ శత్రువువే నన్న సూత్రాన్ని మనం విస్మరించకూడదు భూమండలం మీది సమస్త పర్వతరాజ్యాలకూ, దేవేంద్రుడు, శత్రువు అతను మనకు మిత్రుడే కాదు. మనపరిపాలనా వ్యవస్థలో అతి ముఖ్యమైన పదవిలో ఉన్నవారుకూడా. అతనిమీద పర్వతరాజన్యులకుగల క్రోధ ద్వేషాలలో మనంకూడా పాలుపంచుకోక తప్పదు." అన్నాడు నారదుడు, ఆవేశంతో.

"అవు." నన్నట్లుగా తలపంకించాడు విష్ణువు.

"శంకరుడు మననుండి పూర్తిగా దూరమయ్యాడు. మనలన సర్వనాశనం చేయడంకోసం, బలగాన్ని సంతరించుకొంటున్నాడు. అతనికి సాయపడడం ద్వారా, దేవతలను వోడించ వచ్చునని హిమవంతుడు భావించడంతో తప్పులేదు తనశత్రువుకు శత్రువు, తనకుమిత్రుడవుతాడన్నపాటి లోకజ్ఞానం హిమవంతునికి ఉండదా? అందుకే ఆయన తెలిసీ తెలియనట్లు ఊరుకొంటున్నాడు. కార్చిచ్చు అంతటా అల్లుకోకముందే మేలుకోవడం అవసరం... మీ కివన్నీ తెలియనివి కాదుగానీ, నాకు తెలిసిన వేవో మీకు చెప్పడం నా ధర్మం గనుక చెబుతున్నాను. మరి నాకు సెలవు దయచేయించండి." అంటూనే నారదుడు వెళ్ళిపోయాడు.

కొన్ని క్షణాలపాటు విష్ణుమూర్తి నిశ్చేతనునిలా ఉండిపోయాడు. చివరికి దీర్ఘంగా నిట్టూర్చాడు-

* * *

దక్షప్రజాపతి, శంకరునికి చేసిన అవమానమూ, అందుకు ప్రతిగా శంకరుడు చేసిన విధ్వంసనమూ, చాలా ఆలస్యముగా తారకాసురునకు తెలిశాయి. వేగులు తెచ్చిన ఆ వార్తలు వింటూనే తారకుడు, ఆగ్రహోదగ్రుడయ్యాడు తనవారి నందరినీ సమావేశపరిచి, కర్తవ్యాన్ని నిర్దేశించాడు తారకుడు.

"మహాయోధులారా!" అంటూ ప్రారంభించాడు తారకుడు "ఇంత కాలముగా మనం నిద్రాణంగా ఉండిపోయ్యాం! మన కిష్టం లేకపోయినా నాయకత్వమిచ్చిన ఆదేశాలను శిరసావహించాం. ఇప్పుడా నాయకుడే పరాభవింపబడ్డాడు. పదవీచ్యుతుడయాడు చిరకాలంగా మనం, అన్యాయాలనూ, అధర్మాలనూ సహిస్తూవచ్చాం సమిష్టిసంక్షేమంపేరిట, వ్యక్తులు ధ్వంసమయిపోవడాన్ని

ఆమోదించాం. ఇప్పుడిక అడ్డేమీలేదు. మనపతనానికి కారణభూతులైనవా రెవరో మీకు తెలుసు దయాదాక్షిణ్యాలు విస ర్జించండి. శత్రువులను, వెదకి వెదకి నాశనం చేయండి! వారి నగరాలను కొల్లగొట్టండి స్త్రీలను చెరబట్టండి. రుధిర ప్రవంతులతో ముల్లోకాలనూ తప్తం చేయండి మహావీరులై, తిరిగివచ్చే మీ కోసం, అపూర్వమైన బహుమతు లెన్నింటినో సిద్ధంచేయిస్తాను వెళ్ళండి! ప్రళయ కాల ప్రభంజనులై విలయతాండవం చేయండి!" అంటూ ప్రోత్సహించాడు తారకుడు.

చిరకాలంగా యుద్ధం యుద్ధమంటూ కలవరిస్తున్న రాక్షస సేనావాహినులు, భూనభోంతరాళాలు దద్దరిల్లిపోయే లాగా నలుదిక్కులకూ విస్తరించాయి. ఆ దావానలాన్ని చల్లార్చే నాథు డెవ్వడూ కనిపించలేదు

తారకాసుర విజృంభణంతో, దేవ లోకమంతా అల్లకల్లోలమయిపోయింది దేవతా స్త్రీలలో అసంఖ్యాకులు, రాక్షస

బలగానికి బందీలుకాగా, మిగిలినవారు, మారుమూల ప్రదేశాలకు పారిపోయారు. పేరజీవితమంతా కల్లోలిత మయిపో యింది. దేవేంద్రుడు దిక్కుతోచక బెంబే లెత్తిపోయాడు.

అతను సరాసరిగా విష్ణుమూర్తిని దర్శించాడు. ఉన్నదున్నట్లుగా అతనికి నివేదించాడు.

"దేవా! దేవతాసైన్యాలు తారకుని బలగంముందు నిలువలేక పోతున్నారు. మన సైన్యంలోని అధిక సంఖ్యాకులను మనం కోలుపోయాం. మన శస్త్రాస్త్రా లేవీ వారిమీద పనిచేయడంలేదు. కర్తవ్య నిర్దేశంకోసం, తమ సన్నిధానాని కొచ్చాను," అన్నాడు ఇంద్రుడు.

"ఒక పదవిని మీకిచ్చాను దాన్ని నిర్వహించవలసిన బాధ్యత మీ మీద ఉన్నది మీరా పని చేయలేకపోతున్నా రంటే—ఆ పదవికి కావలసిన అర్హతలేవో మీలో లోపించాయన్న మాట ఇంత వరకూ మీరు, రాక్షస బలగవని అంటు న్నారేగానీ, అందులో పార్వతేయులు కూడా ఉన్నట్లు చెప్పలేదు గిరి పరిసరా లలో కూడా సమరాగ్నిచ్ఛటలు చెలరేగి నట్లు మీ రనలేదు అంటే— ఆ విషయం మీకు తెలియదన్నమాట! కనీసం తెలుసు కొందామన్న ప్రయత్నంకూడా మీరు చేయలేదన్న మాట! అన్ని బాధ్యతలూ, నేనే వహించి, అన్ని కార్యక్రమాలూ, నేనే చూసుకొనే పక్షన— మీరందరూ అనవసరమే! అయినా నేనలా అన దలుచుకోలేదు. అడిగారు గనుక చెబు తున్నాను... తారకాసురుని పరాభూతం చేయాలంటే; మహావీరుడు కావాలి. ఆ మహావీరుడు, వారినుండే రావలసి ఉంటుంది" అన్నాడు విష్ణువు.

ఇంద్రుడు నివ్వెరపోయాడు

"అదంతే!" అన్నాడు విష్ణువు.

"క్షమించండి! నేను అవగాహన చేసికొనలేక పోయాను." అన్నాడు ఇంద్రుడు నీళ్ళు నములుతూ.

కోపం రావడానికి బదులుగా నవ్వొచ్చింది విష్ణుమూర్తికి.

"ఇంద్రా! శివశక్తులు, ఇప్పు డంతటా చెలరేగాయి. కలకాలంగా, అణగి మణగి పడిఉన్న దళిత జాతు లన్నీ, ఇప్పుడు శివునిపక్షం వహించాయి వారందరూ ఏకమైతే, మీరూ, నేనూ, మన ప్రభుత్వమూ నిలబడలేదు ముందుగా వారి బలగాన్ని శక్తిహీనం చేయాలి. శక్తితో కానిపనిని యుక్తితో సాధించడమే, రాజ్య పరిపాలనలోని ముఖ్యాంశం శంకరుని బలగం ఛిన్నా భిన్నం కావాలి. అందుకేమిటిమార్గం?" అన్నాడు విష్ణువు.

"చిత్తం. వింటున్నాను. ఆదే శించండి!" అన్నాడు ఇంద్రుడు, ఏమంటే, ఏం కొంప మునుగుతుందో నని!

విష్ణువు చెప్ప నారంభించాడు.

"పార్వతేయుల బలగం అమేయమైనది; అనన్యమైనది. వారు, శంకరునికి దూరంకావాలి. అలా కావాలంటే, పర్వత రాజుల కోర్కెలను కొన్నింటినైనా మనం అంగీకరించక తప్పదు. పర్వత రాజ్యాలన్నీ ఈనాడు మనకు వ్యతిరేకమే గదా! వారి నందరినీ పేరు పేరు వరుసనా పిలిచి సంప్రదించే వ్యవధి మనకులేదు. హిమవంతునిది సువిశాలమైన సామ్రాజ్యం. సమస్త పర్వత రాజ్యాల ప్రతినిధిగా అతన్ని మనం గుర్తింపుతున్నాం," అన్నాడు విష్ణువు.

"బావుంది ప్రభూ! కానీ హిమవంతుడు ఇందుకు అంగీకరిస్తాడో లేదో మనం తెలుసుకోవడం అవసరం!" అన్నాడు దేవేంద్రుడు.

"పిచ్చివాడా!" అంటూ ఫకాలుమని నవ్వేశాడు విష్ణువు. "పదవీ వ్యామోహితుడు చేయని అన్యాయమూ, అధర్మమూ లేనేలేవు. తన పెద్దరికాన్నీ, రాచరికాన్నీ నిలుపుకోవడం కోసం, హిమవంతుడు ఏమి చేయమన్నా చేస్తాడు. శంకరుని పక్షంనుండి వైదొలగడమే కాదు; అతన్ని పూర్తిగా తొలగించివేయమన్నా సిద్ధపడతాడు. కానీ మన మాపని చెప్పబోవడం లేదు. ఇదంతా మోసమన్న స్పృహ, హిమవంతునికి ఏపాటి కలిగినా, మన ప్రయత్నమంతా ప్రయోజనారహితమై పోయింది,"

దేవేంద్రునికి దిక్కుతోచలేదు. ఏమీ అనలేక గుక్కిళ్ళు పడ్డాడు.

శంకరుని బలశౌర్యాలను మనమూ, అభినందిస్తాం. అట్టడుగున పడివున్న వారి సముద్ధరణకు శంకరుని నాయకత్వమే సరైనదంటాం ఆటువంటివాని తోటి బాంధవ్యం, ఎవరికైనా గర్వకారణమంటాం. తప్పేమిలేదే!"

"బాంధవ్యమా!" అంటూ విస్తుబోయాడు ఇంద్రుడు

"అవును దేవేంద్రా! బాంధవ్యమే! శంకరుడు కళత్రహీనుడన్న విషయాన్ని మనం విస్మరించకూడదు. హిమవంతుని కొక ఆడబిడ్డ ఉన్న విషయాన్నికూడా మనం మరిచిపోకూడదు. శంకరుని మించిన అల్లుడు, హిమవంతునికి దొరకడం అసంభవం!" అన్నాడు విష్ణువు.

"చరిత్ర పునరావృతం అవుతున్నదేమో ప్రభూ!" అన్నాడు ఇంద్రుడు.

అతగాడు, 'సతి' విషయాన్ని దృష్టిలో ఉంచుకొని, ఆ మాటలన్నట్లు విష్ణువు గ్రహించాడు. చిరునవ్వు నవ్వాడు.

"పునరావృతం అవడంలేదు. కాకూడదనే నా అభిప్రాయంకూడా. హిమవంతుడూ, శంకరుడూ, ఒకే వర్గానికి చెందినవారు. 'సతి' విషయం అలాకాదు. ఇక్కడ వర్గభేదమూ, వర్ణభేదమూ కూడా ఉన్నది. చరిత్ర పునరావృతం కావడమన్న ప్రసక్తే లేదే! దీన్నెలా

చేస్తావో నాకు తెలియదు. కావలసిన కార్యం మాత్రం ఇదీ!" అన్నాడు విష్ణువు.

ఆయన లేచి నిలుచున్నాడు.

అంటే 'ఇక వెళ్ళవచ్చు'నని అర్ధమన్నమాట!

అసాధ్యమైన ఈ కార్యాన్ని ఎలా సునాయాసం చేయాలో దేవేంద్రునికి బోధపడలేదు ఆదేశాలయితే అందుకొన్నాడు, కానీ వాటిని ఆచరణలో ఉంచటమెలా?

మొన్న మొన్నటివరకూ, తాను పర్వతరాజ్యాలమీద దాడిచేశాడు. వందలాది పర్వతరాజులను పరాభూతులను చేశాడు. వారందరికీ తనమీద క్రోధ ద్వేషాదులున్నాయి అందరూ ఏకమై, ఇప్పుడు తనమీదకు రాబోతున్నారు. ఈ దశలో తాను వారితో నెయ్యం జరపాలి. అలా కాని పక్షాన పదవిని వదులుకోవాలి. పదవీ పరిత్యాగంతో, తనకున్న సుఖ సంపదలుకూడా దూరమయిపోతాయి. ఎంతోకాలంగా తనీవిలాస జీవితానికి అలవాటు పడిపోయాడు, వీటిని వొదులుకోలేడు. ఉంది అనుభవించాలంటే, తన కిష్టంలేని ఎన్నో కార్యాలను. చేయవలసి వస్తున్నది! ఏమిటి మార్గం?

ముందుగా వేగులను పంపించి, శంకరుని చర్యలను తెలుసుకొన్నాడు దేవేంద్రుడు. హిమాలయ రాజ్యాంతర్భాగంలో ఉన్నాడట శంకరుడు. అక్కడి కెవ్వరినీ ప్రవేశించనీయడం లేదట. హిమంతునికికూడా శంకరుని దర్శనం దుర్లభంగా ఉన్నదట. అతనికి ఎటువంటి ఆపదా రాకుండా, పార్వతేయులు కట్టుదిట్టమైన రక్షణ చర్యలను తీసుకొన్నారట!

ఈ సమాచారాన్ని అందించి, బహుమానా లందుకొని, వేగులు వెళ్ళిపోయారు.

వారు వెళ్ళిన చాలా సేపటిదాకా దేవేంద్రుడు ఆలోచిస్తూనే ఉన్నాడు ఆలోచనాభారంతో, అతనికి శిరోవేదన గూడా ప్రారంభమయింది అయితేనేం గానీ, చివరికొక పరిష్కార మార్గాన్ని కనుగొన్నాడు.

"అమ్మయ్య!" అనుకొన్నాడు దేవేంద్రుడు,

క్రింది పెదవిని సుతారంగా, మునిపంట నొక్కుతూ తనలో తనే నవ్వుకున్నాడు.

ఎదురుగాఉన్న రంభ 'ఇదేమీ' అని అననూలేదు, ఇంద్రుడు చెప్పనూలేదు.

ఉత్సాహంకొద్దీ, రంభ చెక్కిళులను పుణికి, కప్పురపు విడెమైనా అందుకోకుండా, విసవిసా ఎటో వెళ్ళిపోయాడు దేవేంద్రుడు.

* * *

నారదుని చూస్తూనే హిమవంతుడు పేరందిగివచ్చాడు. అర్ఘ్యపాద్యాదులిచ్చి



అల్లంతదూరంలో, రత్నకంబళంమీద కూచున్నా డాయన.

కుశలప్రశ్నాదు లయ్యాక, నారదుడే అసలువిషయాన్ని కదిపాడు.

"పర్వతరాజా! హితుడవు, స్నేహితుడవు నన్న అభిప్రాయంతో, ఒక రహస్యం నీకు ముందుగా తెలియజేస్తున్నాను. తగు సమయం వచ్చిందాకా, ఈ రహస్యాన్ని రహస్యంగానే ఉంచు," అన్నాడు నారదుడు.

హిమవంతుడు రత్నకంబళంమీద, అటూ ఇటూ కొద్దిగా మసిలాడు.

"కొంత కాలంగా మీ పర్వతరాజులకూ, దేవేంద్రునికి వైరం ఉన్నమాట నిజమే! మీ వారిలో చాలామందిని, ఇంద్రుడు పరాజితులను చేసిన మాట కూడా నిజమే! దీనికి కారణం ఇంద్రుడు కాడనీ, విష్ణువనీ నేను చెబితే - నువ్వే కాదు - చాలామంది నమ్మరు కానీ అసలు సత్యమేమిటో నాకు తెలుసు. మరొకరి ప్రోద్బలంతో, తనుచేసిన ఈ ఘాతుక కృత్యానికి దేవేంద్రు డిపుడు, మనస్పూర్తిగా పశ్చాత్తాపపడుతున్నాడు. నిన్ను దర్శించి క్షమాపణ కోరుకుందామని కూడా అత ననుకొంటున్నాడు ఈ అభిప్రాయం దేవేంద్రుడు వెలిబుచ్చినపుడు, అతనికి నే నొక్క సూచన చేశాను. చేసిన తప్పుకు పరిహారంగా, క్షమాపణ చెప్పుకోవడం మాత్రమే చాలదన్నాను. హిమవంతుని, పర్వత

చక్రవర్తిగా గుర్తించి, అతని పాలనాధికారానికి లోబడి, మిగిలిన పర్వతరాజ్యాలన్నీ మెసులుకొనేలాగా తగు కట్టుదిట్టం చేయాలన్నాను. నామీది గౌరవం కొద్దీ అత నిందుకు అంగీకరించాడని నేననను. నీ బలదర్పాలూ, శౌర్యసంపదా చూసి, దేవేంద్రు డిందుకు అంగీకరించాడు. త్వరలోనే, అతగాడు సపరివారంగా నీ సన్నిధికి రావచ్చు. అతన్ని సలాంఛనంగా ఆహ్వానించు. గౌరవించు. చక్రవర్తిత్వాన్ని వహించు," అన్నాడు నారదుడు.

హిమవంతుని కన్నులు ఆనందంతో మెరిసిపోయాయి.

నారదుని మనస్సు కుదుటబడ్డది.

"నువ్వెంతో అదృష్టవంతుడివి హిమవంతా!" అంటూ ప్రారంభించాడు నారదుడు, "ఇపుడే నీ బిడ్డను చూశాను. జగత్సౌందర్యమంతా రాశీభూత మయినట్లుగా తోచింది నాకు. మహావీరుడైన శంకరునికి తగిన భార్యనుకన్న నీజన్మ ధన్యమయింది."

హిమవంతుడు క్షణకాలం విచలితుడయ్యాడు. తిరిగి కుదుటబడ్డాడు, ఏదో అనబోయి, అనలేక, మౌనంగా ఉండిపోయాడు.

* * *

ఎవ్వరికీ ప్రవేశంలేని శంకరుని సాన్నిధ్యానికి గిరిజాదేవి రాకపోకలు సాగిస్తున్నది. కార్యభారంతో సతమతమయిపోతున్న శంకరునికి, చేదోడు వాదోడుగా ఉంటున్నది.

అస లీఏర్పాటు కూడా శంకరునికి ఇష్టంలేదు అనేకసార్లు, అత వా పర్వతరాజపుత్రివి వెళ్ళిపొమ్మని కూడా ఆదేశించాడు. వెళ్ళినట్టు వెళ్ళేది. లేనప్పుడు తిష్ఠవేసేది

"ఇదేమి" అని శంకరుడుకూడా గట్టిగా అనలేక పోయేవాడు. ఎలా అంటాడు?

తన సైన్యాలు. చెల్లా చెదరుగా ఉన్నాయి. ఉన్న బలగాన్నంతా కూడ గట్టుకోవాలన్నా, ముందు, తనకొక స్థిరత్వం ఉండాలి. అదృష్ట వశాత్తూ హిమవంతుని ఆశ్రయం తనకు లభించింది. అతని సైనిక బలగమంతా, తనకు అండ దండలుగా ఉన్నది అంతే కాదు; హిమవంతుని మాటను, పర్వత రాజులందరూ శిరసావహిస్తున్నారు. వారందరికీ, దేవతలమీదా, దేవేంద్రుని మీదా, చెప్పరానంత ఏహ్యాభావమున్నది. వారందరూ, సమయంకోసం ఎదురు చూస్తున్నారని తనకు తెలుసు. వారికి సరైన నాయకత్వం కావాలి. వారిని సుసంఘటిత పరచగలిగిన దక్షతకావాలి. తనా పని చేయగలడు. పర్వతరాజుల తోడ్పాటులో, తను దేవలోకాన్ని పాదాక్రాంతం చేసుకోగలడు. అందులో సందేహ మేమీలేదు.

అయితే ఇదంతా ఎప్పుడు సాధ్యమవుతుంది?

పర్వతరాజుల ఆదరాభిమానాలను

తను పొందాలి. వారికి తన నాయకత్వం మీద పరిపూర్ణమైన విశ్వాసం కుదరాలి. తనవల్ల వారికేవో కొన్ని లాభాలు సమ

కూరాలి. ఇవేవీ కానినాడు _ వారి తోడ్పాటు తనకు లభించనూ లభించదు. తన చిరకాల వాంఛితం నెరవేరనూ నెరవేరదు తనూ, తన అనుయాయులూ, ఇలా మెట్టలూ, గుట్టలూపట్టి పోవల సిందే;

వైవాహిక జీవితంపట్ల తన కెపుడూ ఆసక్తి లేదు 'సతి'ని వివాహమాడినా, ఆమెచేసిన అవమానాన్ని భరించినా, సమిష్టి క్షేమంకోసం చేశాడుగానీ - తనేదో బావుకొందామని గాదు; తనను నమ్ముకొన్న వారిని రవంత బాగు చేదామన్నదే తన తపన!

కర్తవ్యతా విమూఢుడై తనిక్కడి కొచ్చాడు. హిమవంతుడు ఆదరించాడు. ఆశ్రయమిచ్చాడు. అండగా నిలడ్డాడు. ఇవ్వాళ తనతో బాంధవ్యం పెట్టుకోవాలని అభిలషిస్తున్నాడు. తండ్రి అనుమతి లేకుండా పర్వత రాజపుత్రి తనదగ్గర కొస్తున్నదని, తననొక్కనాటికీ అనుకో లేదు. ఈ బాంధవ్యబంధం, తనను మరింతగా బలవంతుణ్ని చేస్తుం దనడంలో సందేహమూలేదు.

'సతి'లాగా, పార్వతికూడా తనను 'చులకన' చేస్తుందేమోనన్న అనుమానం తనకు కలిగింది. కానీ ఆలోచించి చూస్తే ఈ అనుమానానికి ఆధార మేమీలేదు. 'సతి' దక్షప్రజాపతిబిడ్డ, దేవ వంశీయు రాలు. మరి పార్వతి - పర్వతరాజ తనయ!

తనకు పార్వతేయుల అండ [illegible] ఎంత అవసరమో, వారికి తన నాయకత్వం అంతే అవసరం.

గిరిజను కాదని, తను సాధించగలి గిందేమీ లేదు. తను గట్టిగా తిరస్క రించితే, హిమవంతుని తోడ్పాటునుకూడా కోల్పోవలసి ఉంటుంది. ఒక్కొక్క రిని ఒక్కొక్క కారణంతో పోగొట్టుకొని, ఒంటరిగా తను చేయగలిగిం దేమిటి?

హిమసానువులనుండి శీతల వాయు వులు అలవోకగా వీస్తున్నాయి. వెండి రజనువంటి తుషార బిందువులు, సూర్య రశ్మికి మెరసిపోతూ, సప్తవర్ణాలనూ, వెలార్చుతున్నాయి.

గిరిజాదేవి, మంచుతువ్వరలో, అడు గులు వేసుకొంటూ, పూజాద్రవ్యాలతో వస్తున్నది. హసన్ముఖుడైన శంకరుడు ఆమెకు ఎదురువెళ్ళి, చేయూతనిచ్చాడు.

* * *

"అమ్మయ్య" అని తల్పానికి జార గిలబడ్డాడు విష్ణువు.

"ఏమి" టన్నట్లు చూసింది లక్ష్మీ దేవి.

"రాజకీయం" అని ముక్తసరిగా జవాబిచ్చాడు విష్ణువు.